వెంటనే ఆకాశమంతావచ్చి నా కళ్లముందు పడ్డట్టయింది. శకున పక్షు లెగిరిపోయాయి. సాముద్రిక రేఖలు చెరిగిపోయినాయి. పంచాంగాలు చిరిగిపోయినాయి. పండ్రెండురాశుల్ని పండ్రెండు గురు సూర్యులు ఆవరించినంత వెలుగు వెలిగిపోయింది. వెలుగు పడుతున్నకొద్దీ ప్రపంచమంతా తల్లక్రిందలై యూరుకుంది.

... ... ... ... ...

## అది 'వర్టికల్ చావా ?' - 'హారిజాంటల్ చావా ?'

నాకు ఉదయం ఆరు ఆరున్నర కాకుండా కాఫీ త్రాగడం అలవాటు. యీ అలవాటు ఒక ముప్ఫై యేళ్ళనుంచి పరిపాటిగావున్న కారణంచేత ఎక్కడికివెళ్ళినా ముందు ఆ ప్రయత్నంమీదనే ఇంట్లోవాళ్ళంతా నా విషయమై ఉండేటట్లు చూస్తాను. అంచేతను ఆ ఉదయంకూడా నేను వెళ్లింది పొరుగూరు అయినా బసచేసింది కావలసినవాళ్ళ యిల్లవడంచేత ఏలోపం లేకుండా, నాకు రాకుండా నా బంధువర్గం ప్రవర్తించారు.

వారి చావడిలో ఒక టేబిల్‌వుంది. ఉదయం 6½కే టేబిల్ మీద కాఫీపెట్టారు. టేబిల్‌ముందు ఒక కుర్చీ వేశారు. కుర్చీమీద నేను కూర్చున్నాను. నేనొక్కణ్ణేనా? ఇక్కడ కూర్చునేది ? ఇది పుచ్చుకునేది ? అని అంటే నీవొక్కడవే! మేమంతా కొందరం పుచ్చుకొనే పుచ్చుకోం, కొందరం బాగా ఎండెక్కి స్నానం చేశాకో, జపం చేశాకో తీసుకుంటాం" అని వారంతా అన్నారు. ఇంటియజమాని ఆరోగ్యంకోసం త్రాగుతున్నాను అని అలా ఎత్తి ఇంచుకంత కాఫీ చవిచూచాను.

చవిచూచానో లేదో చటక్కున వీధితలుపుతోసిన చప్పుడైంది. తెరువబడింది. వీధి అంతా వెల్లడయింది. అంతగా మార్గం మీద వుంది నే బసచేసిన ఆ యిల్లు.

ఆయింటికి ఎదరతట్టు మరి యిల్లులేవు. అదంతా పెద్ద పొడుగుపాటి గట్టు. గట్టావల పోటుపాటు కలిగివున్నది. పెద్ద మురుగుకాలువ. కాలవమీదను ఒక వంతెన సన్నపాటిది ఒకటి రెండేండ్లయి నిర్మింపబడ్డాది. ఇంకా కొత్తందనం పోనిది ఒకటి కానవస్తూవున్నది వుంది.

ఆ వంతెనను అంతక్రితం సాయంత్రమే షికారుగావెళ్ళి చూచాను. చాలా రమ్యమైన దృశ్యాన్ని ప్రదర్శించింది. ప్రశాంత మైన గాలిని వీచింది. అనుకోకుండానే ఒకడలా నడుస్తూవస్తే, ఒకడిలా నడుస్తూ వెళ్లేవాడు ఆ వంతెన మార్గంగా అవిరళంగా! కాని ఎన్నిసార్లు దాని వెడల్పు నిడిని ఎత్తు కనిపెట్టి చూచినా జీవించివున్న మనిషి నడవడాని కనువైన వంతెనగానే తట్టింది కాని అది అంతకుమించి వేరేవిధిగా తట్టలేదు. దానిపేరే ఇంగ్లీ షులో "పుట్‌బ్రిడ్జి" అంటారు లాగుంది.

వీధితలుపు తోసినతను ఊరుకోక తిరుగదాన్ని మూయ బోయాడు. "మూయకు ఉదయభానుని కాంతిలో కాఫీ ద్విగుణీ కృతంగా నాకుత్సాహమిస్తూ వున్నది" అన్నాను. అంటే ఆవలి వ్యక్తి "ఏమిచూస్తావులే!" అన్నాడు. అంటూ మరింతదగ్గరగా వేశాడు తలుపు. అతడిమాట నాకర్థంకాలేదు. అతణ్ణి లోపలకు వెళ్ళనిచ్చి నేనే నా కాఫీపాత్రను వెలితిచేసి అట్టే వీధితలుపు తెరచి చూచాను. ఓంప్రప్రథంగా వంతెనకేసే చూచాను.

అక్కడ చాలామంది జనం మూగివున్నారు. తక్షణం లోపలకువెళ్ళి, ఇందాకటి వ్యక్తిని పునఃపిలిచి "ఏమిటి! అంత మంది జనం అలా మూగివున్నారు" అన్నాను. అంటే "తెలియదా నీకు? ఒక మనిషి హత్యగావింపబడ్డాడని, కొందరు ఆత్మహత్య గావించుకొన్నాడని కొందరు ఇలా తర్కించుకుంటూ మూగేరు వారంతా!" అని అన్నాడు. నిన్నసాయంత్రం నిక్షేపంలాగువుందే ఆ వంతెన ఆ స్థలం అదంతా!" అని అన్నాను. "ఎంతసేపు

కావాలి ఒక స్థలం యొక్క చరిత్ర మారడానికి" అని అంటూ, ఆవ్యక్తి తిరుగ పరుగెత్తాడు ఆ మూగినజనం ఏమేమి చెప్పు కుంటున్నారో వినడానికి.

నేను వాసిలా పరుగెత్తకుండా గుమ్మంలోనే నిలబడి ఆ దృశ్యాన్నిచూస్తూ ఆలోచించాను.

దృశ్యం! బహూ కనికరం గొలిపే దృశ్యం! ఒక ఊరు పేరులేని మానవుడు తన మెడకు ఒక త్రాడును తగిలించుకొని అలా శవమై వంతెనయొక్క ప్రక్క గజాలనుండి వేలాడి కనిపించ సాగాడు. అయితే ఆ త్రాడు పహాయివాళ్లు తగిలించగా అలా వ్రేలాడిపడిపోయిందా శవం? లేకపోతే ఆత్మహత్యగా పరిణ మించిన మీదట శవమై వ్రేలాడిపోతూందా? అన్నది నాడు నాచూపుకు అనలేదు. ఈ కధను చదివేవాళ్ళకున్ను అనవలసిన అవసరంలేదు.

మన మనస్సుల్ని వేధించవలసిందల్లా-అప్రొద్దు అతని చావు "వర్టికల్ చావా? హారిజాంటల్ చావా?" అని.

"హారిజాంటల్" చావు అని వ్రాశానా యీకధచదివే అందరిపాదాలు కలిసి వాణ్ని వంతెనమీద గత రాత్రి త్రొక్కి చంపివేశారనే వ్రాయాలి. వర్టికల్ చావు అన్నానా ఆపాపం ఎవరినీ చుట్టుకోదు"

అయినప్పటికీ నాడెందంలో సముద్భవించిన ఆనాటి సందేహము ఇప్పటికీ తీరలేదు. ఎప్పటికీ తీరదనే అని అనుకో వలసి వుంటుందేమో కూడాను. ప్రతీవాసిచావు "హారిజాంటల్" అనే అనాలేమో!

అయితే అన్నిచోట్ల అంత సన్నపాటి వంతెనలు అటువంటి వింత ప్రదర్శనములు వాటినుండి వ్రేలాడుతూవున్నవి వుండగలవా?

రాత్రి చీకటి-పగలు వెలుగు. చావు "హారిజాంటల్" అయితేం "వర్టికల్" అయితేం, తెలియవచ్చింది వెలుతురులో శవం! చీకటిలో ఆత్మ.

... ... ... ... ...